క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభం



బంగారు చినశోభనాద్రి సత్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈఓ అడబాల శ్రీనివాస్

బోట్‌క్లబ్: వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు బంగారు చినశోభనాద్రి సత్రం ఈఓ అడబాల శ్రీనివాస్ అన్నారు. స్థానిక పెద్ద మార్కెట్‌లోని బంగారు చినశోభనాద్రి సత్రంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ రీజనల్ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ఆదేశాల మేరకు వేసవి పూర్తయ్యే వరకూ ఈ చలివేంద్రం కొనసాగిస్తామన్నారు.

దేవాలయం వీధిలో..

స్థానిక దేవాలయం వీధిలోని పైడా శ్రీనివాస కల్యాణ మంటపంలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని పైడా రామకృష్ణయ్య ప్రారంభించారు. ఏటా వేసవిలో బాటసారుల కోసం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రతాప్‌నగర్ వద్ద బస్ షెల్టర్ ప్రారంభం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న సాయిమనోహర్

బోట్‌క్లబ్: ప్రయాణికులకు నీడనిచ్చేందుకు ఆంధ్రాబ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ సౌజన్యంతో కాకినాడ–సామర్లకోట ప్రధాన రహదారిపై బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రతాప్ నగర్ వద్ద ఈ బస్ షెల్టర్‌ను యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సాయి మనోహర్ సోమవారం ప్రారంభించారు. సంఘ నాయకులు జె.సత్యనారాయణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ రంగారావు, ఆంధ్రాబ్యాంక్ ఉద్యోగుల సంఘ నాయకులు ఎస్.సత్యనారాయణ, వీఎస్ఎన్ మూర్తి, తాతారావు, సుధాకర్, ఆదినారాయణమూర్తి, జేఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై ఓపీఓలకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఆర్‌ఓ వెంకటరావు

కాకినాడ: ఎన్నికల రోజు అదర్ పోలింగ్ ఆఫీసర్ల(ఓపీఓ) విధులపై సోమవారం శిక్షణ ఏర్పాటు చేశారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. రెండు రోజుల పాటు జరిగే శిక్షణలో దాదాపు 2,400 మంది ఓపీఓలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతిరోజు నాలుగు బ్యాచ్‌లుగా విభజించి ఈ శిక్షణ ఇస్తున్నారు. సుమారు 31 మంది మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా చేపట్టాల్సిన విధులు, సాంకేతికపరమైన, చట్టపరమైన అంశాలు, ఈవీఎం, వీవీ ప్యాట్ల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికలు సమర్థంగా నిర్వహించడంలో ఇటువంటి శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. శిక్షణా కార్యక్రమాలను అవగాహన చేసుకుని ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో ఓపీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ చెల్లన్న దొర, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతకు పరిమితి లేదు

చిత్రకళలో జాతీయ పురస్కార గ్రహీత సుబ్రహ్మణ్యేశ్వరరావు



పురస్కార గ్రహీత సుబ్రహ్మణ్యేశ్వరరావును సన్మానిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: భావోద్వేగాలను, భావాలను రంగుల ద్వారా వ్యక్తీకరించే మార్గం చిత్రకళ అని, ఇందులోని సృజనాత్మకతకు పరిమితి లేదని చిత్రకళలో జాతీయ పురస్కార గ్రహీత మంచం సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ మన సంస్కృతిలో కళాకారులు పోషిస్తున్న అపారమైన ప్రాముఖ్యతను నిరంతరం ధ్రువీకరించుకునేందుకు కళా దినోత్సవం చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, రవిశంకర్ పట్నాయక్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు కాదు.. చిచ్చర పిడుగులు

- చిన్నతనం నుంచే తొణికిసలాడుతున్న ఆత్మ విశ్వాసం
- అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధిస్తున్న బాలభవన్ చిన్నారులు



బాలభవన్‌లో కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు

బోట్‌క్లబ్: వారంతా సామాన్య కుటుంబాలకు చెందిన బాలికలు. తమకిష్టమైన కరాటేలో రాణించాలని కలలుగన్నారు. వాటిని నిజం చేసుకునేందుకు నిత్యం శ్రమిస్తూనే ఉన్నారు. చదువుతో పాటు, కరాటే సాధన రోజువారీ కార్యక్రమాల్లో భాగం చేసుకున్నారు. వీరంతా బాలభవన్‌లో కేవలం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 నామమాత్ర రుసుముతోనే సాధన చేస్తూ పతకాల పంట పండించారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ దక్షిణ భారత రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో 30కి పైగా బంగారు, 28 రజిత , 25 కాంస్య పతకాలు సాధించి కరాటేలో ఔరా అనిపించుకున్నారు. బాలభవన్‌లో కరాటేతో పాటు, సంగీతంలోనూ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ వేసవిలో చిన్నారులు బాలభవన్‌లో వివిధ రకాల సంగీత, వాయిద్య పరికరాల్లో శిక్షణ పొందేందుకు ముందుకొస్తున్నారు.

తిరుగు లేని సామిక



నా పతకాలు చూశారా! : సామిక

గాంధీనగర్‌కు చెందిన కేఎస్ఎస్ సామిక ఆరో తరగతి చదువుతోంది. తండ్రి హరికృష్ణ పీఆర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. 2020 నుంచి సామిక బాలభవన్‌లో శిక్షణ పొందుతోంది. కరాటేతో పాటు, చిత్రలేఖనంలోను రాణిస్తోంది. గతేడాది అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. విశాఖలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ రెండు విభాగాల్లో బంగారు, రజిత పతకాలు పొందింది. ఈ ఏడాది విశాఖలో జరిగిన దక్షిణ భారత స్థాయి పోటీల్లో రజిత, కాంస్య పతకాలు సాధించింది. భవిష్యత్తులో కరాటేలో రాణిస్తానని, డాక్టర్ కావాలన్నదే తన ధ్యేయమంటోంది ఈ చిన్నారి.

ఉచిత శిక్షణ ఇస్తున్నాం



ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం ఏడు గంటల వరకూ శిక్షణ ఉంటుంది. ఆదివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిక్షణ ఇస్తున్నాం. ప్రతి శుక్రవారం సెలవు. ప్రస్తుతం 400 మంది చిన్నారులు ఇక్కడ అడ్మిషన్లు పొందారు. ప్రతిరోజూ వంద మందికి పైగా చిన్నారులు వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ పొందుతున్నారు.

– ఎ.శారద, సూపరింటెండెంట్, బాలభవన్

గెలుపు బాటలో హారిక



ఈ పతకాలన్నీ నావే : హారిక

కాకినాడ ఇంద్రపాలేనికి చెందిన నీలి శ్రీవీర హారిక ప్రస్తుతం శ్రీ నగర్ మున్సిపల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. తండ్రి చిన్నారావు, తల్లి నాగలక్ష్మి ఇంటి వద్ద చిన్న హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బాలభవన్ ఉచితంగా కరాటే, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిసి తమ కుమార్తెను 2021లో అక్కడ చేర్పించారు. కరాటే మాస్టర్.. హారిక కరాటేలో చూపుతున్న ప్రతిభను గమనించి మరింత ప్రోత్సహించారు. గతేడాది సామర్లకోటలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోను, విశాఖలో జరిగిన పోటీల్లోను రజిత పతకాలను, ఈ ఏడాది విశాఖలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు, రజిత పతకాలు, ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించింది. కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన ధ్యేయమని హారిక తెలిపింది.

నిరుపేదలకు అండగా రోటరీ ట్రస్ట్

కాకినాడ సెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ భవనం ప్రారంభం



విరాళం నమూనా చెక్కును అందిస్తున్న సంకురాత్రి చంద్రశేఖర్

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కిరణ్ కంటి ఆస్పత్రి అధినేత సంకురాత్రి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఎంతో మంది నిరుపేదలకు ట్రస్ట్ అండగా నిలుస్తోందన్నారు. ఈ భవనంలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, బ్లడ్ బ్యాంక్, ఫిజియోథెరపీ సెంటర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెంటర్ నగర ప్రజలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ట్రస్ట్ అందించే సేవలను ట్రస్ట్ సెక్రటరీ బోడా ఆనంద్ వివరించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ ట్రస్ట్ భవనంలోని పలు విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ సెంటర్‌కు సంకురాత్రి ఫౌండేషన్ చైర్మన్ చంద్రశేఖర్ రూ.30 లక్షల చెక్కును అందించారు. భవన నిర్మాణానికి సహకరించిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ వాకచర్ల సూర్యం, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ఎల్ సత్యనారాయణన్, డాక్టర్ పూషా, రోటరీ ఎలెక్టడ్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

జ్యోతుల సంస్మరణ సభ

బోట్‌క్లబ్: కాకినాడ మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత జ్యోతుల సీతారామమూర్తి సంస్మరణ సభ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌హాల్ సోమవారం రాత్రి జరిగింది. తొలుత జ్యోతుల చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. కార్పొరేషన్ కార్యాలయ నూతన భవనానికి ఆయన నామకరణం చేసి, జ్యోతుల విగ్రహాన్ని నగరంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీరక చంద్రశేఖర్, మాజీ మేయర్లు పొలసపల్లి సరోజ, సుంకర పావని, సుంకర శివప్రసన్న, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కాకినాడ ప్రతిష్ట పెంచేలా అభివృద్ధి

- వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించండి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



భర్తకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న ద్వారంపూడి మహాలక్ష్మి

కాకినాడ: తీర ప్రాంతమైన కాకినాడ ప్రతిష్టను పెంచేలా అన్ని రంగాల్లో చేసిన అభివృద్ధిని గుర్తించి, రానున్న ఎన్నికల్లో తనకు హ్యాట్రిక్ విజయం అందించాలని సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన 12వ డివిజన్ పర్లోపేట గ్యాస్ కంపెనీ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాకినాడలో 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఆయా లేఅవుట్లను అభివృద్ధి చేసి, దాదాపు 11 వేల ఇళ్ల నిర్మాణాలను కూడా ప్రారంభించామని చెప్పారు. అభివృద్ధి పరంగా కాకినాడలో అనేక కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు, రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో కాకినాడ నగరంలో అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయగలిగామన్నారు. సుమారు 92 వేలకు గాను 85 వేల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించగలిగామన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తనకు మూడోసారి విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు మట్టపర్తి రఘురామ్, బొదిరెడ్ల పుష్ప, పరుశురామ్, జితేంద్రసింగ్, కోనాడ దుర్గాప్రసాద్, మాకిరెడ్డి పద్మ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సతీమణి విస్తృత ప్రచారం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి సోమవారం 40వ డివిజన్ కుళాయి చెరువు సమీపంలోని కొత్తపేట నూకాలమ్మ ఆలయం ప్రాంతం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి భర్త చంద్రశేఖరరెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాలను వివరిస్తూ.. మరోసారి ఆయనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, అటువంటి నాయకుడిని మరోసారి గెలిపించుకుంటే పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ బసవా అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ నాయకత్వానికి విశేష జనాదరణ



స్వచ్ఛంద సేవకురాలు రామదేవు బాలాత్రిపురసుందరికి పార్టీ కండువా వేస్తున్న చలమలశెట్టి, ద్వారంపూడి

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, ద్వారంపూడి
- పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరికలు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వానికి అన్నివర్గాల నుంచి ఎంతో ఆదరణ కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. కాకినాడలోని వివిధ ప్రాంతాల నుంచి జనసేన, టీడీపీలకు చెందిన సుమారు 600 మంది సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక 37వ డివిజన్ మాజీ కార్పొరేటర్ లంకే హేమలతగోపీ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి సుమారు 30 మంది వైఎస్సార్ సీపీలో చేరగా, వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు.

సంఘ సేవకురాలి చేరిక

అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఎంతో మంది పేద వర్గాలకు అండగా నిలిచిన రామదేవు బాలాత్రిపురసుందరి, రామదేవు దుర్గాప్రసాద్ సహా సుమారు 400 మంది సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు) ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరగా, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి, ద్వారంపూడి కండువాలు వేసి, ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాభావంతో పని చేసే వ్యక్తులు పార్టీలోకి రావడం సంతోషదాయకమని చెప్పారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

38వ డివిజన్ నుంచి..

స్థానిక 38వ డివిజన్ సామర్లకోట రోడ్డు ప్రాంతానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 12వ డివిజన్ పర్లోపేట ప్రాంతం నుంచి పార్టీ నాయకులు అదృష్ట దీపక్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది 4, 32 డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరగా, చలమలశెట్టి, ద్వారంపూడి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పరిశీలకుడు అద్దంకి ముక్తేశ్వరరావు, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు సర్వ సన్నద్ధం

- కాకినాడ రూరల్ ఆర్‌ఓ ఇట్ల కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ కిశోర్

కాకినాడ రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకు గాను సర్వం సన్నద్ధంగా ఉన్నామని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ తెలిపారు. ఆరోజు ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 25 వరకూ నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, ఎస్.అప్పారావు, రఘురామయ్య, పంతం నానాజీ, తహసీల్దార్ విజయ ప్రసాద్, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఎన్నికల ప్రచారం

కరప: యండమూరులో కాకినాడ రూరల్ నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయా పార్టీల నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ నాయకులు పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పంతం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆత్మ బంధువు సీఎం జగన్

వేములవాడలో ఎమ్మెల్యే కన్నబాబు ఎన్నికల ప్రచారం



వేములవాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన పేదల ఆత్మబంధువు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని కాకినాడ రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వేములవాడలో సర్పంచ్ కమిడి మంగాదేవి, ఎంపీటీసీ అనసూరి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ బండే తాతాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు బండే వీరబాబు, ఎస్సీ నాయకుడు వజ్రపు కామేశ్వరరావు, మాజీ ఎంపీపీ కమిడి సీతా మహాలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ పాలిక వీర్రాజు తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సచివాలయ, గ్రామ వలంటీర్ల వ్యవస్థ తెచ్చి రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామంలో రూ.3.3 కోట్లతో సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, శివారు సిరిగలపల్లిలంకకు బీటీ రోడ్డు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేసినట్టు వివరించారు. గ్రామంలోని ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.26.35 కోట్ల లబ్ధి చేకూర్చినట్టు చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, తద్వారా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా పలు ఆలయాల్లో పూజలు చేసి, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీక్యాడర్, నాయకులతో కల్సి కన్నబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఓటర్లు కన్నబాబుకు బ్రహ్మరథం పట్టారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ అనిచర్ల పార్వతి, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మారెళ్ల వెంకటరమణ, గ్రామ పెద్దలు కమిడి శంకర్, ఉద్దండ సూర్యనారాయణ, అప్పనపల్లి పెద్ద, దూడల శ్రీనివాస్, వాసంశెట్టి రామారావు, పాలిక రామకృష్ణ, కాకి శ్రీను, కాళ్ల సూరిబాబు, అనసూరి త్రిమూర్తులు, ఏలూరు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలి
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి, ద్వారంపూడి



సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి తదితరులు



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజీనామా చేసిన వలంటీర్లు

కాకినాడ: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ లబ్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చేసే దుష్ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక డి కన్వెన్షన్‌లో 4–13, 27–37 డివిజన్ల పరిధిలోని పార్టీ శ్రేణులు, రాజీనామా చేసిన వలంటీర్లు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమవారం వీరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చలమలశెట్టి, ద్వారంపూడి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ఓర్వలేక, పథకం ప్రకారం తప్పుడు ఆరోపణలు, విష ప్రచారాలకు దిగుతున్నారన్నారు. ఇటువంటి కుయుక్తులను సమర్థంగా తిప్పికొట్టడంతో పాటు, గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. వైఎస్సార్ సీపీకి బూత్ స్థాయి నుంచి పటిష్ట వ్యవస్థ ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకుని ప్రజలకు అండగా నిలిచే వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. సరైన అజెండా లేని ప్రతిపక్ష పార్టీల విధానాలను కూడా ప్రజలకు తెలియజెప్పాలని సూచించారు. పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఆయా క్లస్టర్ ఇన్‌చార్జిలు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి సుబ్బారావు, మల్లిపాముల గణపతి, రోకళ్ల సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేయాలి



కరపలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

కరప: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ ప్రదాత జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి కోరారు. కరప గ్రామంలో సోమవారం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీతమ్మవీధి, నక్కావారి ఎస్సీ వీధి, అగ్నికుల క్షత్రియులవీధి తదితర చోట్ల ప్రచారం చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.